సర్కారు బడులకు రక్షణేది.?

జిల్లాలోని పలు సర్కారు బడులకు రక్షణ కరువైంది. వేసవి సెలవుల నేపథ్యంలో పాఠశాలలకు ఎవరూ రావడం లేదు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న కొందరు సరస్వతి నిలయాలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుస్తున్నారు. పాఠశాలల వద్ద సెక్యూరిటీ, సీసీ కెమెరాలు లేకపోవడంతో మందుబాబులు తరగతి గదుల ఎదుట మద్యం తాగుతూ, సిగరెట్లు కాలుస్తున్నారు. ఆకతాయిలు సీసాలను పగలగొడుతూ ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డులను ధ్వంసం చేస్తున్నారు. మరోవైపు దొంగలు పాఠశాలల్లోని తాళాలు పగలగొట్టి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లేందుకు యత్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భద్రత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – నిర్మల్‌ఖిల్లా

ఈనెల 5న జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. సైన్స్ ప్రయోగశాల గది తలుపులను పగలగొట్టారు. స్థానికులు గమనించి హెచ్‌ఎం పద్మకు చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి కొందరు పాఠశాలలోకి ప్రవేశించినట్లు విచారణలో తేల్చారు. ఆవరణలోనే మద్యం సీసాలూ లభించాయి. ఇదే పాఠశాలలో నెలరోజుల కిందట మిషన్ భగీరథ సంపులోని రూ.25వేల విలువైన మోటారు ఎత్తుకెళ్లారు.

- కొనసాగుతున్న వేసవి సెలవులు
- విలువైన వస్తువులను ఎత్తుకెళ్లేందుకు యత్నిస్తున్న దొంగలు
- ఆందోళనలో హెచ్‌ఎంలు, పోషకులు
- వాచ్‌మెన్, సీసీ కెమెరాల ఏర్పాటుకు వినతి



గత ఏప్రిల్ నెలలో కడెం మండలం పెద్దూరు ప్రాథమిక పాఠశాలలో తలుపుల తాళాలు పగలగొట్టి అందులోని వస్తువులను ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. దీనిపై హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, సిబ్బంది వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో ఇలాంటి ఘటనలే జరుగుతున్నాయి.

జిల్లాలో పాఠశాలలు 735..

జిల్లాలో ప్రభుత్వ పంచాయతీరాజ్ పాఠశాలలు కలిపి మొత్తం 735 ఉన్నాయి. ఆయా పాఠశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక విలువైన వస్తువులు సరఫరా చేస్తున్నా..వీటికి రక్షణ కరువైందని హెచ్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలలో కంప్యూటర్లు, ఎల్‌ఈడీ, డిజిటల్ తెరలు, టీవీ, మైక్ సెట్ స్పీకర్లతోపాటు అత్యంత విలువైన ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) స్క్రీన్లు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో కనీసం రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు విలువైన వస్తువులు ఉన్నాయి. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల్లో ప్రతి బడిలో కంప్యూటర్లు టీవీలు, డిజిటల్ తెరలు ఉన్నాయి. మరోవైపు పీఎం శ్రీ కింద ఎంపికైన పాఠశాలలకు కొత్త కంప్యూటర్లు కూడా అందించారు. గ్రంథాలయ పుస్తకాలు, సైన్స్ ల్యాబ్, మెటీరియల్‌తో పాటు మధ్యాహ్న భోజన వస్తువులు, బియ్యం, వంటపాత్రలు, డెస్క్ బెంచ్‌లు కూడా ఉన్నాయి.

సెక్యూరిటీ, సీసీ కెమెరాలుంటే..

సెలవుల సమయంలో ప్రభుత్వ పాఠశాలలకు వాచ్‌మెన్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా విలువైన వస్తువులకు భద్రత ఉంటుందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

వచ్చే నెల 12 వరకు సెలవులే..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి పథకం కింద వేసవి సెలవుల్లో పాఠశాలల వద్ద వాచ్‌మెన్‌ను నియమించాలని నిర్ణయించినా తర్వాత ప్రభుత్వం మారడంతో కార్యరూపం దాల్చలేదు. గత నెల 24 నుంచి వేసవి సెలవులు ప్రారంభం కాగా తిరిగి జూన్ నెల 12న బడిగంట మోగనుంది.పాఠశాలలకు వెంటనే వాచ్‌మెన్లను లేదా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోషకులు కోరుతున్నారు.



జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు (ఫైల్)

ఇలా చేస్తే బడి సురక్షితం..



సీసీ కెమెరాల నీడలో లక్ష్మణచాంద జెడ్పీ ఉన్నత పాఠశాల

లక్ష్మణచాంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎం శ్రీ పథకం కింద ఎంపికైంది. మంజూరైన నిధులతో పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం రాజునాయక్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. తద్వారా బడి ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలకు చెక్ పెట్టవచ్చని ఆయన చెబుతున్నారు. ప్రస్తుతం సీసీ కెమెరాలను తమ ఫోన్లకు అనుసంధానించుకొని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు నిరంతరం పాఠశాలను పర్యవేక్షిస్తున్నారు.

వాచ్‌మెన్లను నియమించాలి



పాఠశాలల్లో విలువైన వస్తువులు ఉన్నందున వాచ్‌మెన్లను నియమించాలి. వేసవి సెలవులు కావడంతో పలుమార్లు చోరీలు, సాయంత్రం మందుబాబులు, ఆకతాయిల ఆగడాలతో విలువైన వస్తువులు ధ్వంసం అవుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు పాఠశాలల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

– కుమ్మరి వెంకటేశ్, బీజేవైఎం నాయకులు, నిర్మల్

క్లుప్తంగా

నీటి కోసం మహిళల నిరసన



బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ పరిధిలోని గోండుగూడలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ కాలనీ మహిళలు శుక్రవారం ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు కాలనీలో పర్యటించి నీటి సమస్య పరిష్కరించాలని.. లేకుంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇందిర, పోసాని, కమల, లక్ష్మి, గంగవ్వ, సాయవ్వ తదితరులు ఉన్నారు.

ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్ శివారులో రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రతిష్టాపన ఉత్సవాలను ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్‌తో కలిసి నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు రితీష్ రాథోడ్‌కు అందజేశారు. మహేందర్, ఉపేందర్, మనోజ్, అనిల్‌రావు, వెంకటేశ్, సందీప్, శ్రావణ్, శ్రీనివాస్, చిన్నారెడ్డి ఉన్నారు.

విద్యుత్ మోటార్ చోరీ



పరిశీలిస్తున్న ఎస్సై సాయికృష్ణ

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట గ్రామంలో వ్యవసాయ విద్యుత్ మోటారు ఎత్తుకెళ్లిన ఘటన చోటు చేసుకొంది. ఎస్సై సాయికృష్ణ వివరాల ప్రకారం.. రేవోజీపేటకు చెందిన నెరేళ్ల రమేశ్ వ్యవసాయ క్షేత్రంలోని రూ.25వేల విలువైన త్రీహెచ్‌పీ విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయగా బాధితుడు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఘటనా స్థలం పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్లను అర్హులకే కేటాయించాలి'

ఖానాపూర్: ఇందిరమ్మ ఇళ్లను అధికారులు అర్హులకే కేటాయించాలని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు పీటర్, సురేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. కొందరు మధ్యవర్తులు ఇళ్ల వచ్చేలా చేస్తామని పలువురి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈవిషయమై తమ పార్టీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సర్వే చేస్తామని.. అర్హులకు న్యాయం జరగకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సన్మానం




శ్రావణ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్మల్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొండాజి శ్రావణ్‌ను శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, మండలాల అధ్యక్షులు సాయినాథ్, కాశవేణి శ్రీనివాస్, నవీన్, నాయకులు తలోడ్ శ్రీనివాస్, యోగేశ్, రాహుల్ పాల్గొన్నారు.

అల్పాహారం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు శుక్రవారం అల్పాహారం అందజేశారు. పట్టణంలోని ఏ టు జెడ్ సూపర్‌మార్కెట్ నిర్వాహకుడు కన్నె సత్తెన్న ఆధ్వర్యంలో అల్పాహారం అందజేయగా మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో పీడీ ఇమ్రాన్, తదితరులు ఉన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు



రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

సర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో డ్రెయినేజీ చెత్తాచెదారంతో నిండిపోవడంతో సీసీ రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. మసీద్‌కు ప్రార్థనలు చేసేందుకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుపైకి మురుగు నీరు రాకుండా డ్రెయినేజీని శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమ్మె వాయిదా



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రాజన్న

నిర్మల్‌చైన్‌గేట్: దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల దష్ట్యా ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జులై 9వ తేదీకి వాయిదా వేసినట్లు టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న తెలిపారు. జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మె చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. మే 20న స్థానికంగా ఉన్న కార్మికులతో ర్యాలీలు, సభలు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, జిల్లా కార్యదర్శి ఆర్.రామలక్ష్మణ్, రాజన్న, గంగాధర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి, చింతలపేట్ గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజిద్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో దయానంద్, సత్యం, సజ్జు, రమేశ్, వెంకాగౌడ్, శంకర్, లక్ష్మీరాజం, రాజన్న, నర్సయ్య, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేరాలి



ముధోల్‌లో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ముధోల్: నాణ్యమైన విద్య అందే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే ప్రవేశం పొందాలని ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. శుక్రవారం ముధోల్‌లోని ఆయా కాలనీల్లో కళాశాలలో ఉన్న కోర్సులు, సదుపాయాలను వివరించే కరపత్రాలతో ఇంటింటా ప్రచారం చేశారు. ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన వారు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని సూచించారు. పుస్తకాలతోపాటు స్కాలర్‌షిప్ అందుతుందని వివరించారు. అధ్యాపకులు సంజీవ్, సత్యనారాయణ, అంబాదాస్, ప్రవీణ్‌లాల్ పాల్గొన్నారు.

సంస్కృతికి నిలయాలు శిశు మందిరాలు



మాట్లాడుతున్న విద్యారణ్య భారతి స్వామి, పక్కన ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: శ్రీ సరస్వతి శిశుమందిరాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని విద్యారణ్య భారతి స్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏపీనగర్‌లో శ్రీ సరస్వతి శిశుమందిర్ సుభద్ర నిలయం పాఠశాల కాలనీశాఖను ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన పూజలు చేసి మాట్లాడారు. సరస్వతి శిశుమందిరాల్లో చదివిన విద్యార్థులకు చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి అలవడుతాయని పేర్కొన్నారు. ఇలాంటి పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం, దాతలు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ విభాగ్ కార్యదర్శి దామోదర్, జిల్లా కార్యదర్శి గోపాల్ కిషన్, నాగేశ్, సాయినాథ్, మాజీ కౌన్సిలర్ చందూలాల్, హెచ్‌ఎం గంగాధర్ తదితరులున్నారు.

'పోడు' స్వాధీనం మానుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రమేశ్

కడెం: హక్కుపత్రాలు లేని పోడు భూములను అటవీశాఖ స్వాధీనం చేసుకోవడం మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భుక్యా రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పాండ్వపూర్ గ్రామంలో పోడు రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కొన్నేళ్లుగా రైతులు సాగు చేస్తున్న భూములను ఇప్పుడు స్వాధీనం చేసుకుంటామని చెప్పడం సరికాదన్నారు. అర్హులను గుర్తించి పోడు పట్టాలు అందజేయాలని కోరారు. ఇందులో గంగాధర్, మల్లేశ్, నారాయణ, మల్లయ్య, లచ్చన్న, శంకర్, అంజన్న, మహేశ్, భూమన్న, గోపి, సత్తెన్న తదితరులున్నారు.

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్చాలి



బడిబాట ప్రారంభిస్తున్న ఎంఈవో రమణారెడ్డి



బాబాపూర్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ముధోల్: బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో గోపిడి రమణారెడ్డి అన్నారు. మండలంలోని ఆష్టా గ్రామంలో శుక్రవారం బాటిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బడీడు పిల్లలను పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులున్నారు.

దస్తురాబాద్: ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని.. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని మండల విద్యాధికారి గంగాధర్ సూచించారు. శుక్రవారం దస్తురాబాద్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిదండ్రులకు సర్కారు బడుల్లో అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఉపాధ్యాయులు రవీందర్, కోటేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: డీఈవో రామారావు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పోషకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బాబాపూర్‌తోపాటు పలు గ్రామాల్లోని పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, విద్యార్థులకు అందిస్తున్న పుస్తకాలు, నోట్‌బుక్‌లు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం గురించి పోషకులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలని కోరారు. ఇందులో ఎంఈవో అశోక్‌వర్మ, హెచ్‌ఎంలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'దాడిచేసిన వారిని శిక్షించాలి'



మాట్లాడుతున్న మగ్గిడి దిగంబర్

కుంటాల: ముధోల్ మండలం బోరిగాం గ్రామంలో బుద్ధపూర్ణిమ రోజు బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేస్తున్న దళిత సంఘాల సభ్యులపై దాడి చేసిన వారిని శిక్షించాలని అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్ పేర్కొన్నారు. శుక్రవారం కుంటాలలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు దేవిదాస్ హస్డే, చంద్రే అశోక్, గంగాధర్ జాడే, రాజారాం దాసరి, లక్ష్మణ్ హత్తేరావ్, ముద్దం శంకర్, దండె శ్రీరాములు, ఆర్ల నరేశ్, గిరిధర్ జంగ్మే పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల పాట్లు

- గ్రామాల్లో స్థలం చూపినా నిర్మించని ఆర్టీసీ అధికారులు
- ఎండల్లో ఇబ్బంది పడుతున్న జనం



ఎల్విలో బస్సు కోసం చూస్తున్న ప్రయాణికులు



బెల్‌తరోడాలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎండలో నిరీక్షిస్తున్న జనం

తానూరు: మహారాష్ట్రకు సరిహద్దు ప్రాంతమైన తానూరు మండలంలోని బెల్‌తరోడా, తానూరు, ఎల్వి, హిప్నెల్లి, బోరిగాం, జౌలా(బి) గ్రామాల్లో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. తానూరు మండలం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలు బస్‌షెల్టర్ లేక చెట్ల కింద, హోటళ్లలో కూర్చొని బస్సు కోసం ఎదురుచూస్తున్నారు.

గతంలోనే ఆయా గ్రామాల్లో బస్‌షెల్టర్ నిర్మాణం కోసం పంచాయతీలు తీర్మానం చేసి బస్‌షెల్టర్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఆర్టీసీ అధికారులు సైతం క్షేత్రస్థాయికి వచ్చి స్థలం పరిశీలించారు కానీ బస్‌షెల్టర్లు నిర్మించలేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

తాగి నడిపితే కేసు

లోకేశ్వరం: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మన్మద్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట అన్ని ధ్రువపత్రాలు ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఎస్సై దిగంబర్, పోలీస్ సిబ్బంది రాజ్‌కుమార్ ఉన్నారు.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

మామడ: మండలంలోని మామడ, పొన్కల్, లింగంపెల్లి, దిమ్మదుర్తి గ్రామాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో.. కొరిటికల్, పరిమండల్, న్యూసాంగ్వి, టంబుర్ని గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను కొంటున్నారు. ఇప్పటి వరకు ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో 49,245 బస్తాల ధాన్యం, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 32 వేల ధాన్యం బస్తాలను కొనుగోలు చేశారు. లారీల కొరత, రైస్‌మిల్లుల్లో ఆలస్యం, గన్నీ సంచుల కొరత కారణాలతో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన నడుస్తున్నాయి. అకాల వర్షాలతో నష్టం జరగకముందే కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



పూజలు చేస్తున్న కాలనీవాసులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ప్రియదర్శిని నగర్ ఎన్టీఆర్ మార్గ్ కాలనీలో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రాల నడుమ గణపతి హోమాన్ని చేపట్టారు. అనంతరం అర్చనలు, పూజాది కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ కమిటీ, కాలనీ కమిటీ సభ్యులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లోని గాంధీనగర్ కు చెందిన మామిడాల అన్నపూర్ణకు హైదరాబాద్ నిమ్స్‌లో మెరుగైన వైద్యం అందించేందుకు బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రూ.లక్ష యాభై వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీను మంజూరు చేయించారు. ఈ మేరకు బీజేపీ నాయకులు శుక్రవారం మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో అన్నపూర్ణ భర్త గంగాధర్‌కు ఎల్‌వోసీ అందజేశారు. కార్యక్రమంలో జమాల్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, కొండాజి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మాజీ మంత్రి పూజలు



మాట్లాడుతున్న ఐకేరెడ్డి

సోన్: మండలంలోని మాదాపూర్ గ్రామ పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు సమక్షంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ తాను దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ఆలయ నిర్మాణానికి రూ.22 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఐకేరెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మ్యాక ప్రేమ్‌కుమార్, అల్లూరి రాజ నరసింహారెడ్డి, శ్రీకాంత్, అల్లూరి శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి, రమేశ్, రామచందర్, శ్రీకాంత్ యాదవ్, ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.